# మా వూరి మంత్రి శతకం

కథ

## కలశపూడి శ్రీనివాసరావు

ప్రయోగాలు చేసీ చేసీ అంతిమ ఫలితం కోసం ఎదురుచూస్తున్న శాస్త్రవేత్త మనస్థితిలా ఉంది నా పరిస్థితి. ఈ రోజు ఉదయం నుంచి. సాధారణంగా ఒక శాస్త్రవేత్త ఎదురుచూసే ప్రయోగ ఫలితాలు నిజానికి జీవన్మరణ సమస్యలు కావు. అవి ప్రచురించడానికి వీలయ్యే ఫలితాలు, వాటి ప్రచురణ వల్ల వాళ్ళకు వచ్చే పేరు ప్రతిష్టలు, పదవులు కొద్దిపాటి ఆర్థిక ప్రయోజనాలు మాత్రమే. కాని నేను చేసిన ప్రయోగానికి ఫలితం నా చావు కావచ్చు. ఈ విషయం తెలియక ప్రయోగం చెయ్యలేదు. తెలిసే చేశాను.

***

నేను మా వూరిలో హిస్టరీ మాస్టారిని. చరిత్ర పాఠాలు 30 ఏళ్ళుగా చెప్తున్నాను. రిటైర్ అయ్యి రెండు ఏళ్ళు అయ్యింది. రిటైర్ అయిన కొత్తలో ఏమి తోచలేదు. కొద్ది నెలల్లో ఖాళీగా ఉండడం అలవాటయిపోయింది. మీ విశ్రాంత జీవితాన్ని అవిశ్రాంతంగా ఆనందించండి అన్న ప్రకటనకి సరిపోయేలా ఉండేది నా జీవన చర్య. ఉదయాన్నే లేవడం, కాఫీ తాగి నలుగురితో కలిసి మార్నింగ్ వాక్కి వెళ్ళడం, తిరిగి వచ్చి పేపర్ చదవడం, తరవాత నచ్చిన పుస్తకం చదవడం, భోజనం, నిద్ర, సాయంత్రం తోటలో పని, షికారు, అప్పుడప్పుడు సినిమా చూడడం, రాత్రి భోజనం తరవాత టీవీ చూడడం. నిద్ర పోవడం. అలా సాగిపోతున్న నా జీవితంలో ఒక రోజు రాత్రి టీవీ ఆపి నిద్ర పోవడానికి సిద్ధమవుతుంటే దబదబమని తలుపు చప్పుడైంది. కాలింగ్ బెల్ ఉండగా ఇలా రాత్రి తలుపు కొట్టేవాళ్ళు ఎవరై ఉంటారా అని ఆశ్చర్యపోతూ బయట లైట్ వేసి తలుపు తీశాను. ఎదురుగా ఒక వయసు మళ్ళీన పల్లెటూరి మనిషి.

"దప్పికగా ఉంది బాబు, కాసిన్ని మంచి నీళ్ళు పోస్తారా?" దీనంగా అడిగాడు.

"సరే" అన్నాను గుమ్మానికి ఆనుకుని ఉన్న అరుగు మీద కూర్చోమని చేత్తో సౌజ్ఞ చేస్తూ. అతను కూర్చొన్నాడు. నేను లోపలికి వెళ్లి నీళ్ళు తెచ్చి ఇచ్చాను. తాగి, రెండు చేతులతో దణ్ణం పెట్టి-

"శానా అలిసిపోనాను బాబు. ఈ రేతిరికి ఈడే ఈ అరుగు మీద తొంగుని ఎవకల మా ఊరు ఎలిపోతను బాబు" అన్నాడు ఆ వ్యక్తి. అతన్ని తేరిపారి చూసాను. వయసు చెప్పడం కష్టం. ముసిలివాడు. బాగా అలిసిపోయి ఉన్నాడు. దగ్గరలో ఉన్న ఏదో పల్లెటూరి నుండి వచ్చి ఉంటాడు ఆఖరి బస్సు అందుకోలేకపోయి ఉంటాడు అరుగు మీద పడుకొంటే నాకు వచ్చిన నష్టము లేదు కష్టము లేదు.

"సరే ఆకలిగా ఉందా" అని అడిగాను.

"నేదు బాబు" అన్నాడు.

కాని మనిషిని చూస్తే ఏదైనా పెట్టాలనిపించింది. లోపలికి వెళ్లి రెండు అరటిపళ్ళు ఒక గ్లాసుడు మజ్జిగ తెచ్చి అతని ముందు పెట్టాను ఆతను వాటిని ముట్టలేదు. తినమని గట్టిగా చెప్పి ఎదురుగ ఉన్న అరుగు మీద కూర్చొన్నాను. నువ్వు తింటే కాని కదలను అన్నట్టు. రెండు నిముషాలు తరవాత-

"సాన పొద్దుపోనాది మీకు..." అన్నాడు నా నిద్ర తన వల్ల చెడినందుకు కొద్దిగా బాధపడుతూ.

"నువ్వు తినడం పూర్తి అయితే వెళతాను" అన్నాను వేగంగా తినమని సూచిస్తూ.

"నా మనసేటి బాగోనేదు బాబు. తమరెల్లి తొంగొండి బాబు" అన్నాడు.

వెంటనే లేచి వెళ్లిపోదామనుకొన్నాను. కాని కష్టంలో ఉన్నానని చెప్పిన మనిషిని ఊరడించకుండా వెళ్లిపోవాలనిపించలేదు.

"ఏమయింది?" అని అడిగాను



సానుభూతితో.

"ఏటి చెప్పను బాబు, మా తాత ముత్తాతలు కూలి నాలి సేసుకొని పున్కరనికొక ఎకరం భూమి కొని రైతులమయ్యాము. నా తరంలో పదెకరాల పొలంతో చిన్న వ్యవసాయదారుడిగా నిలబడ్డాను బాబు. ఒక్కగా నొక్క కొడుకిని సదువు సెప్పించి ఉద్యోగస్తుడ్ని సెయ్యాలనుకొన్నాను బాబు. సదువు మీద శానా ఆస పెట్టుకొని నా కొడుక్కి కాలేజిదాక భూమి తాకట్టు మీద తాకట్టు పెట్టి సదివించాను బాబు. చదువు పూర్తై రెండేళ్లయింది ఉద్యోగం రానేదు బాబు. అప్పులోల్లకి నా కొడుక్కి ఉద్యోగం వస్తుందన్న ఆశ పోయింది. భూమి అమ్మి బాకి తీర్చమన్నారు. మనూర్లో ఉన్న మంత్రిగారు మా కులపోడే. ఆయన కాడకెల్లి, కాళ్ళమీద పడ్డాను. నా కొడుక్కి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాను. లచ్చ రూపాయలు లంచం కావాలన్నారు బాబు. నేనెక్కడ తెచ్చేది అన్నాను.భూమి అమ్మేయమన్నారు. మూడు తరాల నుండి వస్తున్న భూమి. కాని ఒక్కసారి నా కొడుక్కి ఉద్యోగం వత్తే ముందు తరాలవోల్లయిన నాలా మట్టి పిసుక్కో అక్కర్లేదని భూమి అమ్మడానికే ఒప్పుకున్నాను. నీకే కష్టం వద్దు అని మంత్రిగారే తన మనుషులతో నా భూమి కొనిపించి అప్పులు తీర్చగా లచ్చ మిగిలిందని తీసుకొన్నారు. ఉద్యోగం రేపొస్తుంది, మాపొస్తుందని ఆర్నెల్ల నుండి తిప్పారు. ఇవాళ నాను నా కొడుకు వెళ్లి, బాబు సచ్చిపోతున్నాం ఏదో ఒక తోవ చూపించండి అని బ్రతిమాలితే, ప్రయత్నించాం. పని కాలేదు ఇక మరి రాకు అనేసేరు బాబు. మరి లచ్చ ఇచ్చిం కదా బాబు అంతే ఎవరికిచ్చేవురా అని కసిరి పొమ్మన్నారు బాబు. ఇది న్యాయం కాదని అంటే, నాకు న్యాయం చెప్తావురా, లచ్చ లేదు గిచ్చ లేదు నీ దిక్కున్నచోట చెప్పుకో అని బయటకు పంపిసేరు. నా మొహం చూడలేక నా కొడుకెటో ఎల్లిపోయాడు బాబు. భూమి పోయే, కొడుక్కి ఉద్యోగం రానేదు, మాకిక బ్రతుకు తెరువు నేదు.మంత్రి మా కులపోడు, మాకు ద్యోగం ఎందుకు రాదనీ ఇ్రవీగాను బాబు మొదటికడ్నించి... నాకు... నాకు..." అని ఇక మాట రాక ఆగిపోయాడు.

"అయ్యో... ..." అని అన్నాను కొంత సేపు పోయాక. కాని నా మాట నాకే వినిపించలేదు. "మా కులపోడే కాని మా సెడ్డ అన్యాయాలు సేస్తున్నాడు.బాబు ఈ మంత్రి గోరు. తమలాంటి వోళ్ళు గాంధి తాతలా మాలాంటి సదువురానివాళ్ళని ఆదుకోవాలి బాబు" అన్నాడు దీనంగా ఒక్కొక్క మాట గుండె లోతుల్లోంచి వచ్చింది.

ఒక్కసారిగా నాకు గాంధీకి పోలికేమిటీ అన్న ఆలోచన వచ్చింది. నాకు గాంధీకి పోలిక లేకపోయినా, గాంధీసినిమాలో బ్రిటీషువాళ్ళ కోసం ఇండిగో పంటలు వేసి నష్టపోయిన ముసలి రైతుకి నా ముందున్న రైతుకి పోలిక బాగానే సరిపోయింది అనిపించింది. ఆ ముసలి రైతు గాంధిని చంపారన్‌లో రైతులని బ్రిటీష్ భూస్వాముల నుండి కాపాడమని కోరిన రీతిలో ఉంది ఈ ముసలి రైతు ఆవేదన.


అతన్ని మరీ బలవంతపెట్టలేక, తర్వాత ఆకలి బాగా వేస్తే అతనే తిని పడుకొంటాడు లే అని లోపలికి వెళ్లి తలుపేసుకొన్నాను. పక్క మీద పడుకొని నిద్ర పోవడానికి ప్రయత్నించాను. నిద్ర పట్టలేదు. గాంధి సినిమాలో ముసలి రైతు దృశ్యం కళ్ళముందు మెదులుతూనే ఉంది. ఎప్పుడో తెల్లవారు ఝామున నిద్ర పట్టింది. ఒక్కసారిగా గాంధీ సినిమాలో గాంధి చంపారన్‌లోని ముసలి రైతుతో "ఏది వీలైతే అది చేస్తాను" అన్న మాట నన్ను తట్టిలేపినట్లయ్యింది. లేచి చూస్తే తెల్లవారిపోయింది. అతను లేచి వెళ్ళిపోయాడేమో అనిపించింది. గబగబా లేచి ఇంటి ముందు అరుగు మీద పడుకొన్న ముసలి రైతుతో 'నాకు ఏది వీలైతే అది చేస్తాను' అన్న మాట చెప్పాలని అనిపించింది. వెంటనే పరుగులాంటి నడకతో వెళ్లాను. అతను ఇంకా అక్కడే పడుకొని నిద్రపోతున్నాడు. అమ్మయ్య అతనికి చెప్పాలన్న మాట చెప్పగలుగుతానని అనిపించి ఆనందం వేసింది. చప్పట్లు కొట్టి అతన్ని లేపడానికి ప్రయత్నించాను. లేవలేదు. బాగా నిద్ర పోతున్నాడనుకున్నాను. అతను నిద్ర లేచినప్పుడే చెప్పుదామనుకొన్నాను. లోపలకి వెళ్లడానికి వెనుతిరుగుతుంటే నిన్న రాత్రి ఇచ్చిన పళ్ళు, మజ్జిగ కనిపించాయి. అయ్యో తినలేదన్న మాట. లేచాక ఏదైనా తినమని చెప్పాలి అనుకొని అతనివైపు తిరిగాను. చేతితో తట్టి లేపబోయాను. అతని శరీరం చల్లగా తగిలింది. అతని చల్లని శరీరాన్ని తాకిన నాకు వళ్ళు ఝల్లుమంది. ఒక్కసారి వెనక్కి జరిగి పక్కనున్న స్తంభాన్ని ఆనుకొని మెల్లిగా అరుగుమీద చతికిలపడ్డాను.

అప్పులోల్లకి నా కొడుక్కి ఉద్యోగం వస్తుందన్న ఆశ పోయింది. భూమి అమ్మి బాకి తీర్చమన్నారు. మనూర్లో ఉన్న మంత్రిగారు మా కులపోడే. ఆయన కాడకెల్లి, కాళ్ళమీద పడ్డాను. నా కొడుక్కి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించమని ప్రాధేయపడ్డాను. లచ్చ రూపాయలు లంచం కావాలన్నారు బాబు.

'మా కులపోడే కాని మా సెడ్డ అన్యాయాలు సేస్తున్నాడు బాబు ఈ మంత్రిగోరు. తమలాంటివాళ్ళు గాంధి తాతలా మాలాంటి సదువురానివాళ్ళని ఆదుకోవాలి బాబు' అన్న మాటలు గుర్తొచ్చాయి. 'నాకు ఏది వీలైతే అది చేస్తాను' అన్న మాటలు నాలో నేనే పదే పదే అనుకొన్నాను.

***

మా వూరి మంత్రి న్యూస్ పేపర్లలో, సినిమాల్లో అందరికి తెలిసిన రాజకీయ నాయకుడి లక్షణాలన్నీ కలిగి ఉన్నవాడే. అతన్ని ఎదిరించడం మాట అలాఉంచి, కనీసం ఎదురుపడి మాట్లాడడం కూడా నాకు రాదే. అది జరిగే పని కాదు. హిస్టరీ మాస్టారిగా పాఠాలు చెప్పడం తప్ప గట్టిగా నలుగురితో మాట్లాడడం కూడా రాదు. ఆ మంత్రి చిన్ననాటి నుంచి మా ఊరిలో అందరికీ బాగా పరిచయం ఉన్నవాడే. స్కూల్లో నేను కూడా ఇతనికి పాఠాలు చెప్పినవాడినే. నాకు తెలిసినంత వరకు అతను ఒక అనాథ. ఆ రోజుల్లో మా వూరిలో ఉన్న ఒకే ఒక్క కంపౌండర్ ఇంటి పక్కన పాకలో ఉండేవాడు. ఆ కంపౌండర్ దయ వల్ల, కొద్దిగ చదువుకొన్నాడు. అతని వల్లే రాజకీయాల్లో ప్రవేశించాడు. కొన్నేళ్ళ తరవాత అతనిమీదే పోటీ చేసి గెలిచి రాజకీయాల్లో నిలదొక్కుకున్నాడు.



అప్పుడప్పుడు స్కూల్‌కి వచ్చినప్పుడు తప్ప, నాకు అతనితో పరిచయం లేదు. ఎక్కడైనా కనిపించినప్పుడు 'నమస్కారం మాస్టారు అంటాడు'.నా రిటైర్మెంట్ పార్టీకి ముఖ్య అతిథిగా వచ్చాడు. తాను దండలు వేయించుకొని, నాకో దండ వేసి వెళ్ళిపోయాడు. అంతకుమించి అతని గురించి నాకు తెలియదు.

***

పోలీసులు వచ్చారు. వివరాలు తీసుకొన్నారు. శవాన్ని తీసుకెళ్ళిపోయారు. నాలో అలజడి మొదలయ్యింది. ఒక్కొక్కసారి నా ఆలోచనలు తుఫానులా నన్ను చుట్టుముడుతున్నాయి. ఆకలి, నిద్ర సరిగ్గా లేవు. మార్నింగ్ వాక్‌కి కూడా వెళ్ళలేకపోతున్నాను. ఇంటిలోను,బయట నాలోని అలజడిని గమనించేరు. మిత్రులు చనిపోయిన ముసలివాడి గురించి మరిచిపోమన్నారు. అతడు అన్న ఆఖరి మాటలు నన్ను వెంటాడుతున్నై అని చివరికి ఒక రోజు చెప్పాను మిత్రులకి. ముఖ్యమంత్రికే ఈ మంత్రంటే భయం. ఇతను తనవాళ్ళందరికీ పదవులు కట్టబెట్టి జిల్లాని తన గుప్పిటలో పెట్టుకొన్నాడు. నీలాంటి సామాన్యులు అతని దగ్గరకికూడా వెళ్ళలేరు. అలాంటి అతనిని ఎదిరించి ఈ బీద బిక్కి జనానికి ఏదో చేద్దామని కిందా మీద పడకు అని సర్దిచెప్పారు.

***

నేను ఏమి చెయ్యగలిగినా చెయ్యలేకపోయినా అతని గురించి తెలుసుకోవాలన్న కోరిక పెరిగింది. నాకు తెలిసినవాళ్ళందరిని అతని గురించి ఏమి తెలుసో చెప్పమన్నాను. వాళ్లు చెప్పినవన్నీ విని ఇంటికి వచ్చి ఒక పుస్తకంలో రాసుకోవడం మొదలుపెట్టాను. ఎవరు ఎలా అతని వల్ల మోసపోయారో, ఎవరు ఎలా అతనివల్ల డబ్బులు చేసుకొన్నారో, కాంట్రాక్టులు తెప్పించుకొన్నారో, బదిలీలు చేయించుకొన్నారో, ఉద్యోగాలు వేయించుకొన్నారో, పోలీసు కేసుల్లోంచి ఎలా బయటపడ్డారో, బ్యాంకు లోన్లు ఎలా మంజూరు చేయించుకొన్నారో, ఇళ్ళస్థలాలు చేజిక్కించుకొన్నారో, కొంతమంది స్వంతఅనుభవాలతో, మరికొంతమంది విన్న విషయాలు నాకు చెప్పారు. తెలుసుకుంటున్నకొద్దీ ఆ మంత్రి గురించి ఇంకా తెలుసుకోవాలని అనిపించింది. అతను చేస్తున్న మంచిపనులు అతను చేస్తున్న అన్యాయాల చీకటి కొండల మీద చిరు దీపాల్లా మెరుస్తున్నై. పైపైని చూసే వాళ్ళకి ఇతను చేస్తున్నవన్నీ ప్రజా సేవలాగే ఉంటై. మధ్యతరగతి వాళ్ళ అవసరాలు తీరుస్తాడు, వీలైనంత రాబట్టుకుంటాడు. బాగా డబ్బున్నవాళ్ళు, రాజకీయ నాయకులతో పూర్తి వ్యాపారపరంగా వ్యవహారం నడుపుతాడు. బాగా నష్టపోయేవాళ్ళంతా చిన్న చితక వాళ్ళే. చిన్న చిన్న చలి చీమలు కూడబలుక్కొని పెద్ద పెద్ద పాముల పని పడతాయనే కథలు అక్కడక్కడ చరిత్రలో చదివాను కాని ఈ రోజుల్లో అలాంటివి కనిపించడం లేదేమిటని ఆశ్చర్యపోయాను.

డబ్బు వేటలో అందరూ అందరికీ ఆహారమే. అడవిలో ఉదయం లేచిన దగ్గర నుండి పులి మనిషికి దొరకకుండా తన ఆహారం అయిన లేడి కోసం పరిగెత్తాలి. లేడి తన తిండి తాను తింటూ, పులికి అందనంత వేగంగా పరిగెత్తాలి. లేడికంటే వేగంగా పరిగెట్టకపోతే పులి ఆహారం దొరకక ఆకలితో చచ్చిపోతుంది. పులికందనంత వేగంగా పరిగెట్టకపోతే లేడి పులికి దొరికి చచ్చిపోతుంది. అయినాసరే అడవిలో పులులు, లేళ్ళు ఒక సమతూకంలో ఉంటై. ఎందుకంటే కడుపుకి కావలసినంత దానికంటే ఒక రోజులో వాటికి ఎక్కువ వేటాడి దాచుకోలేదు. కాని మనుషులు అలా కాదు. రేపటికి దాచుకోవాలి. కొడుకులకి, మనవలకి తరతరాలవాళ్ళకి దాచిపెట్టాలి. అందుకోసం వీలైనంత, వీలైన చోటల్ల, వీలైనవాళ్ళ దగ్గర దోచుకోవాలి. దోచించి దాచుకోవాలి. ఒక ధర్మానికి కట్టుబడ్డవాళ్ళని దోచుకోవడం ఏ ధర్మానికి కట్టుబడక తమ స్వార్థానికి మాత్రమే బ్రతుకుతున్నవాళ్లకి చాలా సులభం. మా వూరి మంత్రి ఈ కోవకి చెందినవాడు.

మా జిల్లాకి మంత్రి వచ్చినప్పుడల్లా ఏదో ఒక ఊరిలో ఎవరో ఒకరు ఆయనకు సన్మానం చేస్తుంటారు. మా జిల్లా ఎడిషన్ చిన్న పేపరులో మంత్రి ఫొటోతో, బిరుదులతో, పొగడ్తలతో వార్తల్లో కనిపిస్తుంటాడు. అందుకే అతనిని ఎదిరించలేను. అలాగని మరణించిన ముసలి రైతుకి నా మనసులో నేను ఇచ్చిన మాట మరిచిపోలేకపోతున్నాను. ఆ మాట నన్ను వెంటాడుతున్నది.నాకు మంత్రిని ఎదిరించే బలం, బలగంలేదు. నా దగ్గర ఉన్నది ఒక్కటే. మా వూరి మంత్రి తన ప్రజలని చెప్పుకొంటున్నవాళ్ళనే మోసం చేసి పదవి చాటున పెద్దమనిషిగా సమాజంలో తిరుగుతున్నాడన్నది నిజం. ఈ నిజం నిజంగా ప్రజలని నమ్మించగలనా? వందల ఏళ్ళ కిందట పాలించిన రాజుల చరిత్రల్ని, చరిత్ర పాఠాలుగా ఎన్నో ఏళ్లు చెప్పాను వేల మంది విద్యార్థులకి. ఎదురుగా బ్రతికే ఉన్న వాడి

**నాకు మంత్రి ని ఎదిరించే బలం, బలగంలేదు. నా దగ్గర ఉన్నది ఒక్కటే. మా వూరి మంత్రి తన ప్రజలని చెప్పుకొంటున్నవాళ్ళనే మోసం చేసి పదవి చాటున పెద్దమనిషిగా సమాజంలో తిరుగుతున్నాడన్నది నిజం.**

గురించి వాడి నిజమైన చరిత్రని ఈ ప్రజలకి ఎలా చెప్పాలి? ఇలాంటి ఆలోచనలతో ఉన్న నన్ను పాతపేపర్లు కొనుక్కొనేవాడి కేక వాస్తవంలోకి తీసుకొచ్చింది. నా దృష్టి వాడి సైకిల్‌కి కట్టి ఉన్న పేపర్ల మీద పడ్డది.

"కిలో ఎంత?" అని అడిగాను. "నాలుగు రూపాయలు" అన్నాడు ఆనందంగా.

"ఎన్ని కిలోలున్నై నీ దగ్గర" అన్నాను.

"నా దగ్గర ఎన్ని ఉంటే ఏంటండి? మీ దగ్గర ఎన్ని నెలల పేపర్లున్నాయో చెప్పండి. ఎన్ని కిలోలుంటాయో నేను చెప్తాను" అన్నాడు. ఇంత చిన్న విషయం తెలీదా అన్నట్లు.

"నీ దగ్గర ఉన్న పేపర్లు కొనాలని అడుగుతున్నాను. నా దగ్గర అమ్మడానికి పేపర్లు లేవు" అన్నాను తాపీగా.

"నా దగ్గర మా సేటు కొంటాడు. మీరు కొనడం ఏమిటండి?" అన్నాడు అర్థంకాక.

"నాకు పాత పేపర్లు కావాలి. నెల కింద టివి ఉన్నా నాకుకావాలి. ఉంటే?" అన్నాను.

"లేదండి. కిలోకి రెండు రూపాయలు ఎక్కువ ఇస్తే ఇస్తానండి" అన్నాడు.

"సరే" అన్నాను. అతని దగ్గర ఉన్న అన్ని పేపర్లు కొన్నాను.

వెంటనే కూర్చుని ప్రతీ పేపర్లో మా వూరి మంత్రిగారి గురించి రాసినవి, ఆయన అన్న మాటలు వెతికి, వాటిని కట్ చేసి ఒక వరసలో పెట్టాను. రెండు వారాల్లో అన్ని పేపర్లలో ఉన్న మా ఊరి మంత్రిగారి విశేషాలని, హామీలని, వాగ్దానాలని ఒక పద్ధతిలో ఏర్పాటు చేసాను. వీటి వల్ల మా వూరి మంత్రి గురించి ఇంకా బాగా తెలిసింది. ఏ రోజు వార్తలు ఆ రోజే చదవడానికి, వినడానికి బాగుంటాయి. వెనక్కి వెళ్లి ఆయన చెప్పిన మాటలని, ఇచ్చిన హామీలని, వాగ్దానాలని పక్క పక్క పెట్టి చూస్తే మంత్రి ఎంత తెలివితక్కువగా మాట్లాడేవాడో తెలిసిపోతున్నది. చాలా విషయాలు తెలివితక్కువ మాటలని తెలిసింది. శుష్క వాగ్దానాలని అనిపించింది. అలాంటివాటిని ఒక వంద వార్తలని, ఇచ్చిన హామీలు ఒక వంద, చేసిన వాగ్దానాలు ఒక వంద. వీటిని ఒక పద్ధతిలో పెట్టాను, చరిత్ర చదివిన అనుభవంతో. రైట్ టు ఇన్ఫర్మేషన్ (ఆర్టీఐ) చట్టం క్రింద పది రూపాయలు కడితే ప్రభుత్వంవారు ప్రజలు అడిగిన వివరాలు ఇస్తారని చెలికాని రావుగారు చెప్పినట్టు ప్రజలందరినీ ఈ చట్టాన్ని చక్కగా మంచి పనులకి వాడుకోమని కోరినట్టు వార్తలలో వచ్చిన విషయాలు లోగడ చదివాను.

మా వూరి మంత్రిగారి ప్రజాసేవ గురించి ఒక పుస్తకం వ్రాస్తున్నానని, అందుకు ఆయన ఇరవై ఏళ్ళ పైబడ్డ రాజకీయ జీవితంలో తాలుకాల్లో, జిల్లాల్లో, రాష్ట్రంలో ఆయన పేరుతో సంతకంతోఉన్న కాగితాలు, అర్జీలు, సిఫారసు పత్రాలు అన్నింటిని నాకు పంపమని వివిధ ప్రభుత్వ విభాగాలవారికి వివరంగా ఒక వెయ్యి అర్జీలు పంపాను స్వంత ఖర్చుతో. పంపిన వారం రోజుల తరువాత ఒక్కొక్క అర్జీలో అడిగిన కాగితాలు ఇవ్వడానికి కావలసిన ఫొటో కాపీ ఖర్చుల వివరాలతో ఉత్తరాలు వచ్చాయి.వాటికి తగిన డబ్బు పంపాను వెంటనే. ప్రభుత్వ ఫైళ్ళలో ఉన్న వివరాలతో రోజుకి కొన్ని జవాబులతో ప్రభుత్వం నుంచి మంత్రి ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ పెట్టిన సంతకాలతో చేసిన శంఖు స్థాపనలు, మంత్రిచుట్టు ఉన్నవారి పేరుతో చేపట్టిన కాంట్రాక్టుల వివరాలు రావడం మొదలైంది. వాటన్నిటిని ఒక పద్ధతిలో పెడుతుంటే మంత్రిగారి రహస్యాలు అచ్చుల్లో ప్రభుత్వ ఫైళ్ళల్లో ఇన్నేళ్ళుగా దాగి ఉన్నవి తిరుగులేని సాక్ష్యంగా కనిపించింది.

ఇలాంటివి రోజు వస్తూనే ఉన్నాయ్. ఏ ఒక్కటి చూసినా పెద్ద తప్పుగా కనిపించదు సరికదా ఏదో పెద్ద ప్రజాసేవ చేస్తున్నట్టే అనిపిస్తుంది. ప్రతీ రెండేళ్ళకి కట్టిన బడినే మళ్లీ కడుతూ వేసిన రోడ్డే వేస్తూ కాగితాలకే మాత్రమైన కట్టడాలు ఒకవరసలో పెడితే బాహాటంగా మంత్రిచేస్తున్న దోపిడీ ప్రభుత్వ ఆధారాలతోనే కనిపిస్తుంది. మంత్రిపై గత ఇరవై ఏళ్ళుగా ప్రతిపక్షాలు ఆధారాలతో చేసిన ప్రకటనలు, ప్రజలు పెట్టుకొన్న అర్జీలు, వాటి మీద ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది.

మంత్రిగారి చుట్టూ ఉన్నవాళ్ళపై పోలీసు స్టేషన్, ఏ.సీ.బీలో, విజిలెన్స్ శాఖలో చివరకు సి.బి.ఐ. ఆఫీసులలో ఉన్న సమాచారం కోసం ఆర్టిఐ ద్వారా ఇవ్వాలని దరఖాస్తు చేశాను. ఫోటోకాపీలు ఇవ్వలేము కాని కావాలంటే వచ్చి వాళ్ళ ఆఫీసులోని కూర్చొని చదువుకోవచ్చని జవాబు వచ్చింది. మా మంత్రివారి అనుచరుల నేర చరిత్ర వివరాలు తాలూకా పోలీసుస్టేషన్‌లో, జిల్లా పోలీసు స్టేషన్‌లో, హైదరాబాదులో ఎన్నో దొరికాయి. వాటిని జాగ్రత్తగా ఎత్తి వ్రాసుకున్నాను. ఇలా దొరికిన వందల పేజీల సమాచారాన్ని అందరికి సులభంగా అర్థమయ్యే భాషలో ఒక ప్రణాళికతో పద్ధతిగా ఏర్పాటు రాయడానికి నాకు మూడు నెలల కాలం పట్టింది. ఆ పనిలో ఉన్నప్పుడు ఒకరోజు మంత్రిగారి మనిషిని ఒకతను మా ఇంటికి వచ్చాడు.

"మీరు మన మంత్రిగారి గురించి పుస్తకం రాస్తున్నారని తెలిసింది. సాయం ఏమైనా కావాలా?" అని మంత్రిగారు అడగమన్నారని చెప్పాడు. ఆశ్చర్యపోయాను. మంత్రి బహుశా అతని గొప్పల గురించి రాసిన పుస్తకం అచ్చు వేయించుకోవాలని అనుకుంటున్నాడని అనిపించింది.

"సహాయం ఏమివద్దు.ఇది నా సరదా కోసం రాసుకుంటున్నాను" అన్నాను వినయంగా.

"సరే సరే, పైసలు కావల్తే చెప్పండి. ఇస్తాం... వందలలో అర్జీలు పెట్టినవంట... శతకం వ్రాస్తున్నారా ఏమిటి?" అన్నాడు.

నిజమే ఒకొక్క విషయానికి కనీసం వందల రెఫరెన్సులు ఉన్నాయి.

"అవును, శతకం వ్రాస్తున్నాను" అన్నాను సంతోషంతో.

"రాయి రాయి. కనీసం పదివేల కాపీలు వేయించు. మంత్రిగారు ఖర్చంతా ఇస్తారు. తొందరగా పని పూర్తి కావాలి. ఇంకో రెండు నెలల్లో ఎలక్షన్ డేట్ వచ్చేస్తే మళ్ళీ కోడ్ అంటారు. మీటింగ్ పెట్టడానికి కుదరదు. కాబట్టి నెల రోజులలో పనంతా పూర్తి అయిపోవాలి. వచ్చే నెల మొదటి ఆదివారం మంత్రిగారికి మన ఊరు వచ్చే ప్రోగ్రాం ఉంది. ఆ రోజు ఇక్కడో ఫంక్షన్ ఉంది. దాన్లో ఈ పుస్తకం ఆవిష్కరణ చేయిద్దాం. మంచి ఐడియా వచ్చింది మీకు, గురువుగారు"అన్నాడు నా భుజం తట్టి.

అని తన ప్లానంత పూర్తిగా చెప్పేసి వెళ్ళిపోయాడు. ఆరోజు నించి రాత్రి పగలు పని చేసి మా వూరి "మంత్రి శతకం" అన్న పేరుతో మంత్రిగారు చిన్నతనంలో అనుభవించిన బీదతనం, ఎందరి సహాయం ఎలా తీసుకొన్నాడో, ఆ తదుపరి వాళ్ళందరిని ఎలా మరచిపోయాడో, అప్పటినుంచే స్వార్థంతో ఎలా రాజకీయాలలో కూరుకుపోయాడో ఒక వంద విషయాలు లభించాయి. ఆయన చెప్పి తీర్చని వాగ్దానాలు ఒక వంద ఉన్నాయి.

ఆయన వల్ల, ఎన్నో రకాల కష్టాలు పడి నష్టపోయిన బాధితుల లిస్టు ఒక వంద, ఆయన చేసిన ఉత్తుత్తి శంఖుస్థాపనలు ఒక వంద, ఆయన తెప్పించుకొన్న కాంట్రాక్టులు ఒక వంద, లేని స్కూళ్ళకి బిల్డింగ్ కట్టించిన ఋజువులు ఒక వంద, ఆయన దేశ విదేశాలలో దాచిన డబ్బుగురించి ప్రతిపక్షాలవాళ్ళు ఋజువులతోసహా ఇచ్చిన ప్రకటనలు వంద, ఆయన అనుచరుల నేర చరిత్రకు సంబంధించిన వంద కేసులు, వాటికి ఋజువులు ఒక వంద. ఇలా ఒక ఎనిమిది వందల వివరాలు వివిధ ఆధారాలతో, ఋజువులతో ఒక పుస్తకం తయారుచేసాను. బెంగుళూరు తీసుకెళ్ళి ప్రింటింగ్ చేయించాను. అనుకొన్నట్టే మంత్రిగారి మనిషి చెప్పిన రోజుకి ఒకటి రెండు రోజులముందే పుస్తకాలు అచ్చయి వచ్చాయి. మంత్రిగారి మనిషి ఆవిష్కరణ అని అనుకొన్ననాటికి ముందురోజే వచ్చి ఆవిష్కరణ కోసం మూడు పుస్తకాలు మెరిసిపోతున్న రంగు కాగితాల్లో బాగాఅందంగా కట్టి పెట్టాను. మర్నాటి సాయంత్రం వాటిని తీసుకొని రమ్మన్నాడు. కారు పంపుతానన్నాడు. అన్ని పుస్తకాలు సభకి తీసుకురమ్మన్నాడు. అక్కడ అందరికి పంచాలన్నాడు. ప్రజలు సభకి వస్తారు. కాని ఆ పుస్తకంలో ఏముందో తెలియదు. అందుకే రేపు ఉదయం ఊరిలో

***దబదబమని తలుపు చప్పుడు. చాలా మంది కలిసి ఒకేసారి కొడుతున్నట్టు తెలుస్తున్నది.నేను మంచం మీద నుంచి లేచి అమ్మ నాన్నలని తలుచుకొని వాళ్ళ ఫోటోకి దండం పెట్టుకొన్నాను. తలుపు చప్పుడు ఆగలేదు.***

అందరి ఇంటికెళ్ళి పంచుదాం. పుస్తకం చదివి సభకు రమ్మందాం అని అన్నాను. ఇదేదో కొత్తగా ఉందే. సరే ఉదయం మా కుర్రాళ్ళని పంపుతాను. వాళ్ళ సాయంతో అన్ని పుస్తకాలు పంచేయాలి" అన్నాడు.

"సంతోషం" అన్నాను.

ఆ సాయంత్రం మాఆవిడని వాళ్ళ తమ్ముడింటికి వెళ్ళడానికి ముందే ఏర్పాటు చేసి రైలు ఎక్కించాను. రైలు కదిలిపోతున్నా ఆమె చేతిలో ఉన్న నా చెయ్యిని తీసుకోకుండా రైలుతో పాటు కదిలి పరుగెత్తగలిగినంత వరకు పరిగెట్టాను. నా వింత ప్రవర్తనకి ఆమె నోట మాట రాలేదు.

ఆ రాత్రి ఊర్లో ఉన్న నలుగురి మిత్రులకి డిన్నరు ఇచ్చాను. అమెరికాలో ఉన్న మా అబ్బాయి, కోడలు, మనవరాలితో చాలాసేపు తీరుబడిగా మాట్లాడాను. ఆ రాత్రి చాల నెలల తరవాత హాయిగా పడుకొన్నాను.

మర్నాడు ఉదయం పదిమంది కుర్రాళ్ళు వచ్చారు. పుస్తకాలు ఊరిలో వీధి వీధికి తిరిగి ఇంటి ఇంటికి పంచడానికి తీసుకెళ్ళారు.

***

తొందరలోనే మంత్రిగారి దాక ఈ పుస్తకంలో ఉన్న విషయాలు చేరిపోతాయి.ఇంటి మీదకి తన మనుషులని పంపుతాడు.వాళ్ళు తనని బతకనివ్వరు.ఇది ఎప్పటినుండో తెలిసిన విషయమే.అందుకునేనేమి గాభరా పడలేదు. పిరికివాడిలా ఊరి నుండి పారిపోలేదు. అరవై రెండేళ్ళ జీవితం చాలు అనుకొన్నాను. మధ్యాహ్నం అయింది. భోజనం చేసి పడుకొన్నాను.

దబదబమని తలుపు చప్పుడు. చాలా మంది కలిసి ఒకేసారి కొడుతున్నట్టు తెలుస్తున్నది.నేను మంచం మీద నుంచి లేచి అమ్మ నాన్నలని తలుచుకొని వాళ్ళ ఫోటోకి దండం పెట్టుకొన్నాను. తలుపు చప్పుడు ఆగలేదు. నాకు ప్రేమతో పాఠాలు చెప్పిన గురువులని మనసులోనే తలుచుకొని నమస్కారం పెట్టుకున్నాను. తలుపు చప్పుడు పెరిగింది. మా కుటుంబం మాత్రమే ఉన్న ఫోటోని ఆప్యాయంగా చేత్తో తడిమి దాన్ని మళ్ళీ దాని స్థానంలో పెట్టాను. అప్పుడు తాపీగా వెళ్ళి తలుపు తీసాను. ఒక ఇరవై ముప్పై మంది మనుషులు ఇంటిలోకి గబగబా వచ్చి లోపల నుంచి తలుపు వేసేశారు.

"మాస్టారు... మీ పుస్తకం చదివాం... మంత్రిగారి చరిత్రంతా తెలిసింది.మేమే కాదు ఎంతోమంది చదివారు. ఊరంతా చదివారు. గొప్ప చరిత్ర సంకలనం. మంచివాళ్ళ గురించేకాదు దుష్టుల గురించి కూడా రాయవచ్చు. అందువల్ల సమాజానికి మేలు జరుగుతుంది. చాలా గొప్ప పనిచేసారు మాస్టారు. వందల మంది కోపంతో మంత్రిగారి కోసం సభాస్థలికి వెళుతున్నారు... మీకు మంత్రిగారి మనుషుల నుండి ఎలాంటి ఆపద రాకూడదని... కొంత మందిమి ఇలా వచ్చాం..." గుక్క తిప్పుకోకుండా ఒకరి తరవాత ఒకరు నన్ను చుట్టుముట్టి చెప్పారు.

వచ్చినవాళ్ళు అలసిపోయినట్టున్నారు. మంచినీళ్ళు ఇచ్చాను. ముసలి రైతుకి ఇచ్చిన మాట నిలబెట్టుకోబోతున్న క్షణమిది. తృప్తిగా ఉంది. ఇన్నాళ్ళు చెప్పిన చరిత్ర ఇవ్వాళ ఆయుధం అయింది అని మనసులోనే అనుకొన్నాను.

కొత్త చరిత్రకు ఊరివాళ్ళు ఊతమిచ్చినందుకు సంతోషించాను. వర్తమాన చరిత్రని దాచుకున్న ఆ పుస్తకాన్ని చేత్తో అదుముకున్నాను. చరిత్ర రచనా శాస్త్రం బోధిస్తే సరిపోదు. దోపిడి చరిత్రను రాయడం అవసరం.

చరిత్ర ఎప్పుడూ ప్రేరక పదార్థం కావాలి. అది ఇకనైనా పాఠ్యాంశంలాగా స్తబ్దంగా ఉండకూడదు.దూరంగా మంత్రిగారి రౌడీల చేతుల్లో మారణాయుధాలు. దీటుగా ప్రతి యువకుని చేతిలో ఓ పుస్తకం. గెలుపు ఎవరిదో చరిత్ర నిర్ణయిస్తుంది. నా వరకు- ఒక ఉపాధ్యాయుడిగా ఎన్నడూ లేనంత తృప్తి- చరిత్ర ఆచరణ అయిన ఆ క్షణాన!

***(ప్రేరణ: మంత్రిగారిని పంతుళ్ళు ప్రశ్నించని ప్రశ్నని వారి సహచరులే ప్రశ్నించడం చూసి)***